నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. కృష్ణానగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్, తులసి నగర్, వెంకటేశ్వర్ నగర్, గంగా నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు...

- చిక్కడపల్లి ఫీడర్ పరిధిలోని చిక్కడపల్లి, వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉమాగార్డెన్, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30గంటల వరకు..
- గాంధీ కుటీర్ ఫీడర్ పరిధిలోని విఠల్‌వాడి, శివాలయం టెంపుల్, నారాయణ కాలేజ్, ఎయిర్‌బస్ అపార్ట్‌మెంట్, హిమాయత్‌నగర్ పెట్రోల్‌బంక్ తదితర ప్రాంతాల్లో 3.30 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం

పంజగుట్ట: తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న లలితా కళాతోరణంలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నగర అధ్యక్షుడు ఎం.బి.కృష్ణా యాదవ్ తెలిపారు. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో టీజీవో నగర జాయింట్ సెక్రటరీ కొత్త విద్యాసాగర్‌తో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరై ప్రభుత్వానికి మన డిమాండ్‌ను వినిపించాలని పిలుపునిచ్చారు.


బీజీయూఎస్ అంబర్‌పేట కోకన్వీనర్‌గా వెంకటేశ్ దయాల్



వెంకటేశ్ దయాల్‌కు నియామక పత్రం అందజేస్తున్న కన్వీనర్ అచ్చిని రమేష్

అంబర్‌పేట: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) అంబర్‌పేట నియోజకవర్గం కో-కన్వీనర్‌గా బాగ్‌అంబర్‌పేటకు చెందిన వెంకటేశ్ దయాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ అచ్చిని రమేశ్ సోమవారం ఆయనకు నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సికింద్రాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం ప్రాణదానం లాంటిది'



అంబేడ్కర్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో డాక్టర్ సరోజ వివేక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రక్తదానం ప్రాణదానం లాంటిదని ప్రతి ఒక్కరూ ఇలాంటి మంచి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో రాజయోగిని దాది ప్రకాశమణి 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి చిక్కడపల్లి ఇన్‌చార్జ్ బీకే జయశ్రీ, ప్రిన్సిపల్ మట్టా శేఖర్, అడ్మినిస్ట్రేటర్ కిరణ్, లింగప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (55) రైల్వే క్వార్టర్స్ వద్ద అనారోగ్యంతో పడి ఉండటంతో పోలీసులు గుర్తించారు. ఈనెల 17వ తేదీన ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యాన్‌చంద్ ఎక్సలెన్సీ అవార్డుకు కేపీ శివప్రసాద్ ఎంపిక



కాచిగూడ: అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అందజేసే మేజర్ ధ్యాన్‌చంద్ ఎక్సలెన్సీ అవార్డుకు మేజర్ కేపీ శివప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా. రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సలెన్సీ అవార్డును ఈనెల 29వ తేదీన జరిగే కార్యక్రమంలో మేజర్ కేపీ శివప్రసాద్‌కు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. పురుషోత్తం ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డులను అందజేస్తారని ఆయన తెలిపారు. కేపీ శివప్రసాద్ 42 సంవత్సరాలుగా క్రీడా, ఎన్‌సీసీ రంగంలో సేవలందించారని తెలిపారు. 27 సార్లు రక్తదానం చేసి జాతీయ అవార్డును అందుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో శివప్రసాద్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు.

తొలగించడం మంచిదే.. తరలిస్తే బాగుంటుంది.!

- ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే తొలగించిన చెట్ల కొమ్మలు
- ఎప్పటికప్పుడు కొమ్మలు తరలించాలని స్థానికుల విజ్ఞప్తి



బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో..



శంకరమఠం రహదారిలో రోడ్డు పక్కనే ఇలా..



శివం రోడ్డులో రోడ్డు పక్కనే..

గణేశ్ చతుర్థి ఉత్సవ ఏర్పాట్లలో మండపాల నిర్వాహకులు నిమగ్నమవుతుంటే జీహెచ్‌ఎంసీ అధికారులు ఉత్సవాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. భారీ గణపతులను మండపాలకు తీసుకొచ్చే క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ గత వారం రోజులుగా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తోంది. నిమజ్జన సమయంలో సైతం భారీ విగ్రహాలు ఇబ్బందులు లేకుండా వెళ్లేలా రోడ్లకు ఇరువైపులా చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులను అభినందించాల్సిందే. కానీ తొలగించిన కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించకుండా అక్కడే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌లపైనే కాకుండా రోడ్లపై కుప్పలుగా కొమ్మలు పేరుకుపోవడంతో పాదచారులు రోడ్లపై నుంచి నడిచి వెళ్తున్నారు. మరో పక్క రోడ్డు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ అధికారులు కొమ్మలు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో కొమ్మలు తొలగిస్తే అప్పటికప్పుడే అక్కడి నుంచి కొమ్మలను తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – నల్లకుంట



ఫీవర్ ఆస్పత్రి సిగ్నల్స్ సమీపంలో..



జాహ్నవి కళాశాల సమీపంలో..



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా..



శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పైనే..



ప్రశాంత్‌నగర్ బస్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై ఇలా..

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట మండల పరిధిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. 29 కల్యాణలక్ష్మి, 70 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం అంశాలకు రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే అందరికీ అందేలా చొరవ తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హనుమంతారావు, కార్పొరేటర్లు బీ.పద్మావెంకట్‌రెడ్డి, అమృత, విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి



లలిత సంగీత కళాకారిణి ప్రసన్నలక్ష్మిని సత్కరిస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి: సాంస్కృతిక రంగాల్లో పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. నవ్యనాటక సమితి వైస్ చైర్మన్ ఏవీ రామారావు ఆధ్వర్యంలో 26వ ఏవీ సావిత్రి స్మారక లలిత సంగీత పోటీలు సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగాయి. లలిత సంగీత కళాకారిణి ప్రసన్నలక్ష్మిను ఈ సందర్భంగా కేవీ రమణాచారి ఆత్మీయ సత్కారం చేసి మాట్లాడారు. గురువులు కళాకారులను ఉన్నతంగా రాణించేలా తీర్చిదిద్దాలన్నారు. లలిత సంగీత వ్యాప్తికి నవ్య నాటక సమితి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్యాగరాయ గాన సభ అభివృద్ధికి రూ.10లక్షల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. తొలుత నిర్వహించిన లలిత సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర, ప్రముఖులు శ్రీనివాస్, ప్రభాకర్, సురేఖ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన దంత వైద్య సేవలు అందిస్తున్నాం

దత్తసాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఎండీ డా. ఎంఎస్ రంగారెడ్డి



నల్లకుంట: దంత సమస్యలతో బాధపడుతున్న వారికి రెండు దశాబ్దాలకు పైగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పయనీర్ డెంటల్ కళాశాల ప్రొఫెసర్, దత్తసాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి తెలిపారు. సోమవారం నల్లకుంటలోని డెంటల్ క్లినిక్‌లో ఆయన దంత సమస్యలపై మాట్లాడారు. దంత సమస్యలపై బాధపడుతున్న వారికి అంబర్‌పేట, నల్లకుంట, రామంతాపూర్, దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురి, నాగోల్ తదితర ప్రాంతాలలోని తమ క్లినిక్‌లో మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. తమ ఆస్పత్రిలో చిల్డ్రన్స్ డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ ధనేశ్వరి ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు వైద్యం అందిస్తున్నామని తెలిపారు. నగరంలో తరచు ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారికి టూత్‌పేస్టులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. తాము అందిస్తున్న వైద్య సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు.

మూతపడిన కల్లు దుకాణాలను తెరిపించాలి

- జీఓ నం.93ను వెంటనే రద్దు చేయాలి
- వైన్స్, బార్ల కేటాయింపులో గౌడ కులస్తులకు రిజర్వేషన్లు కల్పించాలి
- మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: గౌడ కులస్తుకు వ్యతిరేకంగా ఉన్న జీఓ నం.93ను రద్దు చేసి మూతపడ్డ కల్లు దుకాణాలను వెంటనే తెరిపించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌడ వ్యతిరేక జీఓను రద్దు చేయాలని డిమాండ్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ కల్లుగీత సమన్వయ సంఘాల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కల్లుగీత సొసైటీలకు వైన్స్, బార్ల కేటాయింపులో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 50 శాతం సబ్సిడీ ఇచ్చి అమలు చేయాలన్నారు. మూతపడిన కల్లు దుకాణాలను వెంటనే తెరవాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమిని కేటాయించి తాటి, ఈత వనాలను పెంచాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా జీఓ నం.93 కాపీలను చించేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, ప్రముఖులు అంబాల నారాయణగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, ప్రభాకర్‌గౌడ్, రవికుమార్, దామోదర్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జీఓ నం.93 కాపీలను చించేసి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ కల్లుగీత సమన్వయ సంఘాల కమిటీ నేతలు

రేపటి నుంచి లక్ష్మీగణపతి ఆలయ నవరాత్రి ఉత్సవాలు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో గణేశ్ చతుర్థి నవరాత్రి మహోత్సవాలను ఈనెల 27 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, ఈఓ లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన గణేశ్ నవరాత్రి ఉత్సవాల వివరాలను వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. దేవాలయం ఎదుట రూ.7లక్షలతో షెడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయికీర్త్ బాబ్జీ, నవీన్, దినేష్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు ఉచిత విద్యుత్ నిర్ణయం హర్షణీయం

నల్లకుంట: గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల రత్నానగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్‌రావు సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. వినాయక మండపాలకు విద్యుత్ తీసుకునే వారు నిపుణులైన ఎలక్ట్రీషియన్‌తో విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలని కోరారు.

క్రైస్తవుల హామీలు అమలు చేయాలి

హిమాయత్‌నగర్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అలాగే ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యూనిటీ ఫౌండర్ డా.రాధా మ్యాథ్యూస్, ప్రతినిధులు డా.సాధు సత్యనాథ్, బిషప్ సింగం విల్సన్, డా.డానియేల్, సుధీర్ మాట్లాడారు. పాస్టర్లకు ఇస్తామన్న గౌరవ వేతనం రూ.5వేలు, డబుల్ బెడ్రూం, హెల్త్ కార్డ్ హామీలను విస్మరించిందన్నారు. త్వరలోనే సీఎం, డిప్యూటీసీఎంకు వినతి పత్రం అందజేస్తామన్నారు.

దైవభక్తి, దేశభక్తిని చాటిచెప్పేదే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్, పాల్గొన్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

ముషీరాబాద్: నగరంలో భక్తిప్రపత్తులతో నిర్వహించే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు దైవభక్తి, దేశభక్తిని చాటి చెబుతాయని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్‌హాల్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేసేందుకు ఆనాడు ఉద్యమపోరాటంలో భాగంగా సామూహిక వినాయక మండపాలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. గణేశ్ మండప నిర్వాహకులు ఇబ్బందులు సృష్టించకుండా ప్రభుత్వ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. భక్తిభావంతో నవరాత్రి ఉత్సవాల నిర్వహించుకుని హిందూ ధర్మాన్ని కాపాడాలన్నారు. వైభవంగా నిర్వహించే గణేశ్ ఉత్సవాలు భాగ్యనగరానికే వన్నె తెచ్చాయని అన్నారు.

ప్రతిరోజు రాత్రి 9గంటలకు సామూహిక దీపారాధన..

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ... భాగ్యనగరంలో లక్షకు పైగా గణేశ్ మండపాల్లో పూజలు జరుగుతాయని అన్నారు. ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు రాత్రి 9గంటలకు వినాయక మండపాల వద్ద సామూహిక దీపారాధన చేయాలని సూచించారు. హిందువుల ఐక్యతను చాటిచెప్పాలన్నారు. అనంతరం గణేశ్ నవరాత్రి ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు శక్తిసింగ్, పరమశ్‌కుమార్, బుర్రా రాజ్‌కుమార్, ఎం.నవీన్‌గౌడ్, ఆయూష్, బిజ్జి రవి, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పథకం బకాయిలు చెల్లించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పి. శంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బెస్ట్ అవైలబుల్ పథకం కింద ప్రైవేట్ పాఠశాలు, హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఉచిత విద్యను అందిస్తామని ప్రభుత్వం చేబితే తమ పిల్లల్ని చదివిస్తున్నామని దీనికి కూడా యాజమాన్యాలు ఫీజులు వసూలు చేయడం బాధాకరమని డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీబీఎఫ్, పీఎంసి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదువుతున్న విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా సాకుతో హాస్టల్ వసతిని సైతం ఎత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నవంబర్‌లో ఇవ్వాల్సిన ఎస్సీ విద్యార్థుల అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వకుండా కుట్ర చేశారని ఆరోపించారు. అందుకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తే జూలైలో నోటిఫికేషన్లు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.శివలింగం, రాజేందర్, సంజీవ్, పులి కల్పన, శారద, సుదర్శన్ పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



బాగ్‌అంబర్‌పేటలోని ఎస్‌బీఐ పార్క్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

చిక్కడపల్లి: మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహతో కలసి ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌వో ప్రవీణ, సూపర్‌వైజర్ సోమేశ్వర్, జవాన్, ఎస్‌ఎఫ్‌లు రాజ్‌కుమార్, సందీప్, బీఆర్‌ఎస్ నాయకులు పున్న సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్ రవిశంకర్‌గుప్తా, బి.కిరణ్‌కుమార్, నవీన్‌యాదవ్, రచ్చ నరేశ్, సాయిచాణక్య రెడ్డి, సాయియాదవ్, దీన్‌దయాల్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో..

చెరువులు కాలుష్యం కాకుండా మట్టి గణపతులను పూజించి నిమజ్జనం చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీ గణపతి దేవాలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నర్సింగ్‌రావు, ఈఓ లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో...

కాచిగూడ: భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి భక్తులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కాచిగూడలో ఆమె భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బల్వీర్, కృష్ణకుమార్, సుభాష్ పటేల్, శీర్‌సాగర్, నర్సింగ్ యాదవ్, వాసు, బి.భీమ్‌రాజ్, సాయిబాబా, ఆర్.సంతోష్, లావణ్య, సూరి, అజయ్, సోమయ్య విష్ణు, దేవా తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో...

అంబర్‌పేట: మట్టి గణనాథుల ప్రతిమలను ప్రతిష్ఠించడం పర్యావరణ పరిరక్షణకు దోహదమని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ పార్క్‌లో హైదాబాద్ జిందాబాద్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆమె మట్టి గణనాథులను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... గణేశ్ చవితి వేడుకలను అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

భోలక్‌పూర్ డివిజన్‌లో...

ముషీరాబాద్: పర్యావరణ పరిరక్షణకు గణేష్ నవరాత్రి ఉత్సవాలలో మట్టి గణనాథులనే పూజించాలని భవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆయన భక్తులకు ఉచితంగా మట్టి గణనాథుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తూ హిందువుల ఐక్యతను చాటాలన్నారు. మండపాల వద్ద భక్తిపాటలు, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది సురేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ క్యాంపు కార్యాలయంలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావని



కాచిగూడలో భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222